# పానకంలో పుడకలు

ముచ్చటగా ఆ మూడు రోజులూ గడవక ముందే చెప్పా పెయ్యకుండా అల్లుడుగారు వెళ్ళిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది. గుసగుసలు బయలు దేరాయి. సారి పెళ్ళి వారందరూ ముక్కులమీద వేళ్లుంచు గున్నారు. ఒకళ్ల చెవులొకరు కొరుక్కుంటున్నారు. తలొక విధంగా వ్యాఖ్యానిస్తూ గింజుకు పోతున్నారు.

''అదేం చోద్యమమ్మా!'', ''ఇలా ఎక్కడా జరగలేద''ని కొందరన్నారు.

''ఇంటా వంటా లేనిది ఇదేమిటి ?'', '' నలుగురులో నగుబాటు కాదా'' అని యింకొందరన్నారు. వంశానికే ఏదో అపఖ్యాతి వచ్చేసిందని అందరూ యీ విధంగా అనుకుంటూ దవడలు సొట్లు పడేటట్లు నొక్కుకుంటున్నారు.

ఇంత మంది యిలా వేగిపోతున్నా.... ఎవరికీ అసలు కారణం మాత్రం అంతు దొరకలేదు. దానికి కారణం కోసం పరిశోధన ప్రారంభమయింది. ఆ పెళ్లి పందిరిలో.

గోప్యం కాస్తా గోలలోకి దిగింది. మూతల పడ్డ నోళ్లు చకచకా వాగే అవకాశం లభించింది! బిరడాలు పడ్డ చెవులు సడలేయి. పనిలేని చేతులు అభినయ పూర్వకంగా విన్యాసం చేస్తున్నాయి.

ఎవరి నోటంట విన్నా -

''శుభమా అని శోభనం మూడు రోజులూ కాకుండా పెళ్లికొడుకు ఎందుకు వెళ్లిపోయాడు?'' అని ఒక అమ్మలక్క అంటే.

''ముచ్చటగా మూడు రోజులూ గడవకుండా ఎవడయినా వెళ్లిపోతాడా ? ఏదో విశేషం లేకపోతే?'' అని మరో చిగురు బోడి ప్రశ్నించింది.

''మర్యాదలేం తక్కువయ్యాయో ఏమో ? మాట దక్కనిచ్చాడు కాదు'' అని యింకొక ప్రౌఢ సంశయం వెళ్ల బుచ్చింది.

'' అట్లాంటి వేమయినా వుంటే సర్దుకుపోవాలిగాని యిలా బజారున పెట్టుకుంటారా? మనుషులన్న తర్వాత లోటుపాట్లు రావూ ?'' అని యింకొకామె సమర్థించింది.

''ఏం జరిగిందో ఏమిటో అసలు సంగతులు మనకేం తెలుస్తాయి ? '' అని ఒక యువతి అంది. ''అవును వాళ్లకీ వాళ్లకీ ఏమున్నాయో ! కొండ త్రవ్వితే రాళ్లు.'' అని మరొకతె ప్రతిపాదించింది.

''వాడికి పుట్టిన బుద్ధికాదు. ఎవరు పెట్టేరో పెంట !'' అని చిన్న అనుమానం లేవదీసింది ఒక మెల్లకంటి ముత్తయిదువు.

''ఎవరో పెట్టేదేమిటే ఏదో జరిగే వుంటుంది.'' అని ఖచ్చితంగా, ఇంకొక ఆమె చెప్పింది.

''పోనీ, వెళ్ళిపోయాడే అనుకో! వెళ్ళిపోతూంటే ఏదో బ్రతిమాలుకుని సముదాయించ అవుకోవాలిగాని వూరుకుంటారా'' అని అంది ఒక పూర్వ సువాసిని.

''బావుంది. బావుంది! యిహనదొక్కటే లేదనుకున్నావా? అల్లుడు కారణం లేకుండా అలిగి వెళ్ళిపోతుంటే ఎవరయినా చూస్తూ వూరుకుంటారా? అందులో యిలాంటి సమయంలో, అన్నీ జరిగాయట! ఎంత బ్రతిమాలుకున్నా అటువేసిన కాలు యిటు కదపలేదుట,'' అని ఒక వనిత ప్రత్యక్షసాక్షిలా చూసి వచ్చినట్లు చెప్పింది.

''పోనీ ఏమయినా కావలిస్తే యిచ్చుకుంటాం అని కూడా అన్నారట! కాని చెప్పినా లాభం లేకపోతేనే వూరుకున్నారట!''

''పాపం ఆడపిల్ల గలవాళ్ల మనసులు ఎంత క్షోభిస్తాయి అన్న యిదేనా వాళ్లకి వుండదు కాబోలు!'' అని అంది ఒక జాలిగుండె గల జలజాక్షి.

''బావుంది మొగ పెళ్లి వారికి పట్టుదలలూ పంతాలేగాని పై సంగతులన్నీ వాళ్లకెందుకు? యిలాటివన్నీ వోట్ల జరిగే ఆనవాయితీలే కదూ?''

''దేనికయినా, సమయమూ, సందర్భమూ వుండొద్దూ! ఎక్కడ జరగవలసింది అక్కడ జరిగితేనే ముద్దుగా వుంటుంది! యిటువంటప్పుడు అలిగితే ఎవరికి నష్టం?'' అని అంది ఒక అనుభవజ్ఞురాలు.

ఈ విధంగా చర్చ జరుగుతుండగా అంతవరకూ వూరుకొని యింక వూరుకోలేక ఒకామె - రహస్యంగా అందరి మధ్యకీ జరిగీ -

''నా మొహం! అవేవీ కావటర్రా! అసలు లాభం రుచి చూస్తేనే కదా! నష్టం సంగతి అనుభవంలోకి వస్తుంది! అసలు ఏఁవీ లేందే?''

''అదేఁవిటే! లాభనష్టాలు అంటున్నావు? అదేదో సరిగ్గా చెప్పి ఏడవరాదూ?'' అని అడిగింది యింకొకామె ఆ అర్థోక్తి బోధపడక.

''ఇంతసేపూ మీరేఁవంటారో అని వూరుకున్నానుగాని... యిదంతా చూస్తే ఆ సూరమ్మా... బంగారమ్మా... చెప్పింది నిజమేనని తోస్తోంది!'' అని ఆమె మనసులో వున్నది దాచుకోలేక బయటపెట్టింది.

''ఏం చెప్పారట!'' అని ఆతృతగా అందరూ ఆమె మీద పడి అడిగారు!

''చెప్పడం ఏమిటి నా మొహం! వాళ్లు ప్రత్యక్షంగా చూసి అనుకుంటూ వుంటేను! యింకా నిజమూ, అబద్ధమూ అన్న సందేహం లేదు. ప్రత్యక్షంగా కనబడుతున్నదేట! - తొలినాడు వుదయాన్నే వెళ్లి చూసి అటువంటి సూచనలేవీ కనబడలేదని ఆ నరసమ్మ చెప్పింది... అయినా వాళ్లన్నదే నేనంటున్నానుగాని, నేనన్నానని నా మీద పెట్టేరు సుమా! నాకెందుకొకళ్ల గొడవలు!'' అని తన మీదకి రాకుండా అడ్డు పెట్టుకుంది. అనవలసినదేదో అనేసి!

'' అవును వాళ్ల మొహాలు చూస్తే తెలయడం లేదూ'' అని యింకొకర్తె అంత వరకూ ఏమీ

తెలియని దానిలా వూరుకునే అన్నీ తెలిసినట్టు అంది ; -- ఒకళ్లు అసలు విషయం బయట పెట్టేసరికి మరి ఫర్వాలేదు అన్నట్టు అందరూ అనడం మొదలెట్టేరు. -

''మొదటి రాత్రి... కొత్తో... సిగ్గో... అమాయకమో. తెలియకో - అనుకున్నాం కాని... రెండోనాడు కూడా...''

''ఆఁ... నిజమేనంటావా !... ఎంచేతో ఏమిటో !''

'' తెల్లవార్లూ - ఆ భాగోతం అంతా అదుగో .. ఆ వెంకమ్మా.. సుబ్బమ్మా... కూడా చూశారట!'' అని అంత వరకూ మాటాడకుండా వింటూకూర్చున్న వాళ్లని కదిపింది, యింకొకామె.

''అదేమే వెంకూ ? అలా ముంగిలా కూర్చున్నావు తెలిసి వుండేనా ?... యివతల మేంతన్నుకు చస్తూంటేనూ ?''

'' మనకెందుకు లేవే ! ఎప్పటికయినా వాళ్లూ వాళ్లూ ఒకటేను, ఎటొచ్చీ యిదిగో అన్నారు ఆడిపోసుకున్నారని మనని ఏంటారు !''

''లోక సహజం అనుకుంటాం ! మనం మానేస్తే లోకం వూరుకుంటుందా ? చెబుతూ... పిల్ల భయపడి వుంటుందంటావా ?''

''సింగినాదం ! యీనాటికి సుకుమారి వెలిసింది మహా !... మొదట్లో కొంచం బితుగ్గా వున్నా... మనమంతా ఎలా చెబితే అలా నడుచుకోలేదా ? ...అంతెందుకూ మన లక్ష్మికన్నా ఎక్కువా ఏమిటే !.... అది మొదటి రోజున బెదిరి పోయి యివతలకే వచ్చేసింది.... కూడదమ్మా అని నయాన్ని చెప్పేసరికి రెండో రోజు సర్దుకుపోలేదూ ? ఇలా అల్లరి పెట్టుకుంటారా ?'' అని వెంకమ్మ అనుభవజ్ఞురాలు, చెప్పింది.

''ఇది చాలా విడ్డూరంగా వుంది ! దానికయినా ఎవరూ చెప్పలేదమ్మా !'' ''బావుంది నీ ప్రశ్న. యీ సంగతులు యీ కాలప్పిల్లలకి చెప్పేదేమిటి ?... వాళ్ళకి తెలియదనుకోడం మన తెలివి తక్కువ, తిరిగి మనకే. ఆ లక్షణాలన్నీ చెప్పకుండా వుంటే సరి. అయినా ఒకనాడు కాకపోతే ఒకనాడయినా నేర్చుకోవాలిగాని ఒకరు చెప్పేదేమిటీ... చెప్పినా వింటారా ?''

అలా ''కొట్టి పారేయకూ. ముక్కు పచ్చలారంది దానికేం తెలుస్తుంది... అంతా మొగాడిలో వుంటుంది... త్రిప్పుకోడం ఏమంటావు?''

''ఆ మాటంటే నేనొప్పుకోను; యింకెక్కడయినా ఏమోగాని... మేం చూస్తూనే వున్నాంగా.... పాపం. యీ పిల్లడు అలాటి వాడుకాదు. మొదటి నుండి ఎంతో నెమ్మదిగా- మంచిగా, ఓర్పుగా చెబుతూ వచ్చేడు... కాని అదే... అటు త్రిప్పిన మొహం యిటు త్రిప్పందే!''

''అయ్యో; దానికేం సంకటమే !''

'' సిగ్గు బిడియాలు అందరికీ వుంటాయి.... ఎంతయినా అంతలా బిగుసుక్కూచో కూడదు. అది మొండితనం కింద తయారవుతుంది !''

''తర్వాత ఏమిటయింది!''

''- కొంతసేపలాగే బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంది ! అతడెంతో చనువుగా ప్రేమతో

పలకరించినా... ఒక్క మాట కూడా మాటాడలేదు... సరికదా అతని వేపయినా చూడలేదు- అలా సగం రాత్రి గడిచిపోయింది!''

''అయ్యయ్యో! దాని సిగ్గు బొగ్గులనా!... బావుంది. అయితే వూరుకున్నాడూ?'' ''అబ్బే! ఎంత నెమ్మది! ఎంత సహనం. అలాగే మంచి మాటలు చెబుతూ ఎంతో లాలించేడు... ఆఖరి కెలాగయితేనేం ముక్కకి ముక్క మాత్రం జవాబు చెప్పింది.''

''మరేం బాగానే వుంది... మరి ఏ ఆడది మాత్రం సిగ్గు విడిచి ముందు మాటాడేస్తుంది?''

''ఇంతవరకూ బాగానే వుంది''-

''అంతసేపూ యిద్దరూ నిలబడే వున్నారు...... అతగాడు, దగ్గరగా వచ్చి - చెయ్యి పట్టుకున్నాడు..... అదేమీ అనలేదు.. ఆ తర్వాత... మంచం మీద...''

''ఆఁ.. అయ్యయ్యో... మీకెంత సిగ్గులేదే! యింకా చూస్తూనే వున్నారూ?'' అని ఒకామె అడిగేసరికి

''అబ్బా! వుండూ చెప్పనీ! మధ్యలో పానకంలో పుడకలా... వూరుకో!'' అని మరొకామె విసుగ్గా కసిరింది ఆతృతగా వింటూ -

''కూర్చోబెట్టేసరికి.. వెంటనే లేచి నుంచుంది!''

''అయ్యో! దానికేం వచ్చిందే!''

''మరెంత పలకరించినా నోరు కదపలేదు!''

''మహా యోగ్యంగా వుంది!''

'' తర్వాత ఫలహారాలిచ్చాడు. అది ముట్టుకోలేదు...''

''ఏం చెప్మా!.. తర్వాత...''

'' ఇంకేముంది - ఏం జరగాలో అదే జరిగింది -''

''జరిగిందీ?''

'' - నాబొంద! అసలు మనిషిని దగ్గరకు రానివ్వందే!''

'' ఇష్టం లేదో ఏమిటో!''

''అబ్బే! అలాటి దేఁవీ కాదు''

''ధనగర్వం అంటావా?''

'' ఆఁ మహాఁ లక్షాధికారి కూతురా? - కోటీశ్వరుడి కూతురా? అలా మాటాడులావు? అయినా డబ్బుంటే మాత్రం ఎంతమంది లేరు! ఇలాటి సమయాల్లో బెట్టుసరి ఏమిటీ!... తెలివి తక్కువ?''

''అంత పెడసరం కూడదు!''

''మొహం చూస్తే అలాగేం కనపడదే!''

''ఏం ఎరగనట్టు అలాగే వుంటారు లేవే!''

''తనకు తోచకపోతే ఒకరిని చూసి అయినా నేర్చుకోవాలిగాని యిలా కాపురం

సాడుచేసుకుంటుందా?''

''పులిని చూసినట్టు మొగుడిని చూస్తే అంత భయపడిపోతే ఎలా ?''

''- భయం కాదూ ఏమీకాదూ.... మొండితనం... లేకపోతే - చక్కని వాడు కాడనా? ఏం తక్కువయిందని ... చక్కా... ఈడూ జోడూ, చిలకా గోరింకాల్లా వున్నారు ! ...ఎందుకో ఆ యిది!'' అని... ఒకర్తె చెప్పేసరికి .

''...మనలో మాట.. ఏమే సుబ్బీ ... పిల్లకి అనువో ఏమిటో !.... అలాటి వేమీ లేవుకదా?'' అని యింకో ఘోరమయిన సందేహం వెలిబుచ్చింది మరొక ఆమె -

''నిక్షేపం లాటి పిల్ల!... దానికేమే ! .. చిన్నప్పటి నుండి మన దగ్గరే కదా పెరిగింది! ఏం ఎరగనట్టు అడుగుతావేం ?'' అని వెనుకేసుకొచ్చింది మరొకామె.

''ఇంక అబ్బాయి కూడా సరాయివాడా ఏమిటీ? మేనరికం అయెను! ఎరక్కపోవడం అంటూ వుంటుందా ? అటువంటి వాటికి అవకాశం లేదు !''

''ఏమిటో పాపం పుణ్యం ఆ భగవంతుడికే తెలియాలి! ఆ గొడవలేమిటో !''

''అయితే ఆ రాత్రి అల్లా అలాగే గడిచిపోయిందన్నమాట !''

'' ఆc ! కోడి కూసేవరకూ అదే వరస యింకేముంది. వాళ్ళల్లా మిడుతూ మిడుతూ చూసుకుంటూ కూర్చున్నారు. యింక అంతే. అని మేం పనుల్లోకి పోయాం!''

''ఆ మర్నాడేమయిందో చూశారా !''

'' ఊరుకుంటారా ? వాళ్లతో సహా యువతల వీళ్ళూ జాగరం చేశారు !''

''మళ్లీ యధాప్రకారమే మొదట రోజులాగే మూడు గంటలూ కొట్టేవరకూ అయిపోయింది.''

'' ఆ ... తర్వాత!''

'' వెలుతురుంటే సిగ్గు పడుతుందేమోనని దీపం కూడా ఆర్పేసేడు !'

''అయినా.....?''

''- దీపం ఆర్పేస్తే నాకు భయమేస్తుంది... వెలిగించండి!'' అని ఖచ్చితంగా చెప్పేసింది- పాపం అలాగే చేశాడు...

దగ్గరగా తీసుకుని ... ఎన్ని విధాలో బ్రతిమాలాడు.. ఆఖరికి - ఎవరయినా చూస్తున్నారేమోనని జంకుతున్నావా '' అని కూడా అడిగేశాడు.

'' ఆc! ఎంత మాటన్నాడు ? అలాక్కూడా అనేశాడన్నమాట ! మీరు చూస్తున్నట్టు అలికిడి వినేవుంటాడు.''

''ఏమో ! అయినా వాడంటే మానేస్తామా ఏమిటీ ? - యింతకీ చొప్పొచ్చే దేమిటంటే, అంత యిదిగా చూసినా అదేమీ అనలేదు. మంచం దగ్గరికి తీసుకువెళ్లి మంచి మాట లాడితే మురిపించి మురిపించి కబుర్లు మాత్రం చెప్పింది ''

...అంతే... మళ్లీ యధాప్రకారమే!

''అయ్యో కర్మ ! అటువంటి సమయంలో కొత్త జంట ఎలా వుండవలసింది ? కోరుండి

చేసుకుంది అతడి నవసలసిన పనిలేదు!''

''ఏ దెయ్యమో - దేవతో పట్టిందో ఏమిటో ... లేకపోతే మొదట్లో ఏ ఆడదయినా అల. ఎదిరిస్తుందా అదీ ఆడ పుట్టుక పుట్టిందా మరి!''

''ఎంత సేపని సెనుగులాడుతాడు! వూరుకుని మాటలు మొదలెట్టేడు. అది అటు ప్రక్కకి తిరిగిపోయి చీకూ చింతా లేకుండా పడుక్కుంది!... పాపం - అతడలా దానివైపు చూస్తూ అలోచిస్తూ కుర్చీలో కూర్చుండిపోయాడు! ఇదీ రెండవరోజు భాగోతం... యిలా తెల్లారింది!''

''సిగ్గు.సిగ్గు... ఎవరితో చెప్పుకున్నా... ఎంతపని చేసింది! యిలా చేస్తే వెళ్లిపోయాడంటే ఆ అబ్బాయిదా తప్పు?

ఈ విధంగా అక్కడికి వచ్చిన పెళ్లివారూ, అమ్మలక్కలూ తర్జన భర్జనలు చేసి ఆడ పెళ్లివారిదే తప్పు అని తేల్చేశారు.

ఈ గోలగోరంతలు కొండంతలయి పెళ్లి పెద్దల వరకూ వెళ్లింది. పెళ్లికూతురు తల్లి కూడా ఇదంతా గమనించి భయపడింది. అందరూ యిలా అనుకోవడంతో అనుమానం బలపడి ఎటించి ఏమొస్తుందో అని బెంగపెట్టుకుంది.

ఏది ఎలా వున్నా అల్లుడు మూడు రాత్రులూ పడక ముగియకుండానే, ఆకస్మాత్తుగా వెళ్లి పోవడం, ఎవరితోని చెప్పక పోవడం - వీటి వల్ల పెళ్లి పెద్దలకీ కూడా కాళ్లూ చేతులూ ఆడలేదు! కారణం అంతకన్నా తెలియలేదు. ఎరిగున్నంత మట్టుకు ఏ విషయంలోనూ వారేం లోపం చేయలేదు. పెట్టుపోతల్లోనయితేనేం, మర్యాదల్లో నయితేనేం, అన్నీ యధావిధిగా జరిపేరు. అలాటప్పుడు అల్లుడలా వెళ్లిపోయాడంటే ఎలా వుంటుంది?

ముక్కు పచ్చలారంది. ప్రపంచ జ్ఞానం లేనిది, అయిన తమ కూతురి వల్ల ఏం తప్పుంటుందని అనుమానించగలరు! అయినా అమ్మలక్కల గోలవల్ల-సారి. పెళ్లికూతురు మాలతిని మెల్లిగా అడుగుదామనుకుంది ఆమె తల్లి.

మాలతి తలవంచుకుంది సిగ్గుతో - తల్లి జడ వేస్తూంది. మాలతిలో ఎటువంటి భావాలు వున్నాయో! ఆమె యీ పరిస్థితిల్లో ఎలా వుందో ఏమనుకుంటుందో, ఆమెను చూసి చెప్పడం కష్టం. అయినా ఆమె కళ్లలో కొంచం బెదురు. హృదయంలో భారం కనబడుతూ వుంది. ఆమె అంతలోనూ అమాయకత్వం నిండివుంది.

''మీ ఆయన ఏం చెప్పేడా? ఏమిటే?'' అని అడిగింది తల్లి మెల్లగా. మాలతి తనని కాదన్నట్టుగా వూరుకుంది.

''నిన్నే... నే... అడుగుతున్నది... పిల్లా...'' అని నడ్డిమీద పిడికిటితో మెల్లిగా పొడిచింది. అల్లుతున్న జడపట్టుకు కళ్లెంలా - లాగింది

''అబ్బా! నెమ్మదిగా వెయ్యవే'' అని అంది బాధతో - మాలతి.

''సరేలేగాని - మీ ఆయన ఎవరికీ చెప్పా చెయ్యకుండా వెళ్లిపోయాడేం?''

''అదేమో తననే అడుగు నాకేం తెలుసు!'' అని బుంగమూతి పెట్టి అంది.

''నీతో చెప్పలేదేమిటే! అలిగి వెళ్ళిపోయాడా ఏమిటి!''

''బావుంది! నాకెందుకు చెప్తారు! నాకేం తెలీదు!'' అని మూలి ముడిచేసుకుంది. వస్తున్న ముసిముసి నవ్వులని దాచేసుకుంటూ.

''నీకంత నవ్వులాటగా వుంది... గాని.. నలుగురిలోనూ మేం మొహం ఎత్తుకు తిరగాలా?''

''ఏమొచ్చిందే యిప్పుడు?''

''మరి మూడు రోజులూ కాకుండానే వెళ్ళిపోయాడేం! నీకేం తెలీదంటావు!''

''నాకేం తెలుస్తుంది! యిది మరీ బావుందే!''

''నీకు తెలియక పోవడం ఏమిటి ... ఏదో గొడవచేసి వుంటావు. తెలియదనుకున్నావా? చూసినవాళ్ళూ చెబుతూంటేను. అయినా చిన్నపిల్లవా ? యిన్నేళ్ళు వచ్చేక యింకా చెప్పాలా ? తగినట్టు నడుచుకోవాలిగాని -

''ఒకరోజు కాకపోతే, మరో రోజయినా గ్రహించకపోతే ఎలా ? మొదట్లోనే నీమీద ఏం అనుకున్నాడో ఏమిటో ? మొగాడి మనసు విరిగిందంటే ఆడదాని జీవితం ఏమవుతుందనుకున్నావు?'' అని మాలతి తల్లి మొదలు పెట్టింది.

మాలతి కిదేమీ అర్థంకాక చూస్తూ ఏం మాటాడక పూరుకుంది. ''మన వంశంలో ఎక్కడా లేనిది యిలా చేస్తున్నావేమిటే ? అప్రతిష్టపాలు చేయడానికీ?''

''..........''

''శుభమా అని నీకోసం యిన్నిపాట్లూపడి మంచి యింట్లో పడేద్దామని తలపెడితే యిలా అభాసు చేసుకుంటారా ?''

''.........''

''అసలు ఏమిటి జరిగింది... ఎదుకలా మొండిపట్టు పడుతున్నావు!.. నాతో చెప్పడానికి నీకేమే. తల్లీ... అందరూ నీదే తప్పంటున్నారు... విన్నావా ... ?''

ఇదంతా ఏమిటో, తన్నెందుకు తల్లి యిలా నిందిస్తోందో తన తప్పేమిటటో ... మాలతికి బోధపడలేదు. ఏం చెప్పడానికి తెలియడం లేదు. కాని యిలా మాలతి జవాబు చెప్పకపోవడం... అమ్మలక్కలందరూ తన దగ్గర చెవిని యిల్లు కట్టుకుపోరి తలకెక్కించిన విషయాలూ... మాలతి తల్లికి, ఒక దురభిప్రాయాన్ని కలగజేసేయి.

తన కూతురు వల్లే తప్పు వుందని - ఆ రెండు రాత్రులూ, మాలతి భర్త దగ్గర సవ్యంగా ప్రవర్తించలేదని అందికే అల్లుడు అలిగి కోపంతో వెళ్ళిపోయాడని... అనుమానం వుండి పోయింది. అందుకే ఎలాగయినా కూతురి ద్వారా కారణం తెలుసుకొని, మెల్లిగా చెప్పి ఒక దారికి తీసుకురావాలని అనుకుంది. అయినా ఎన్ని విధాల తల్లి ప్రశ్నించినా, మాలతికి యిదేం అర్థం కాక అయోమయంగా వుంది. అన్ని వింటూ అమాయకంగా కూర్చుంది.

మళ్ళీ తల్లి మొదలెట్టింది -

''అతను వెళ్ళిపోయాడంటే తప్పా! యిప్పుడేమొహం పెట్టుకు బతిమాలుకోడం? యింత

ఇలాంటి పని చేస్తావని అనుకోలేదు. యింకా పాలు తాగుతున్నావా ? జ్ఞానం వచ్చిన దానివి ఆపాటి తెలియదూ?''

''...............''

''మంచీ చెడ్డా, కష్టం, నష్టం ఆలోచించవద్దూ! ఎవరికి నష్టం అనుకున్నావు ? అదృష్టం బాగులేకపోతే ఎట్నుంచి ఏది వచ్చినా ఆజన్మాంతం నువ్వూ, నీతోపాటు మేమూ ఏడవ్వలసిందేనా? యింకేమయినా వుందా ?''

''..............''

''మన మర్యాద మనం వుంచుకోవాలి. ఆమోజు అలాగే కాపాడుకోవాలి - గాని యిలా తెలివి తక్కువగా ప్రవర్తిస్తే .... నీ బ్రతుకు ఏమవుతుంది ?''

''.............''

''ఏది ఎటయినా ఆడదానికే నష్టంగాని - మొగాడికేం - ఆరోజునే కదా నువ్వంటే ఏమిటో, ఎటువంటిదానివో - ఆయన తెలుసుకొని, ఒక అభిప్రాయానికి వచ్చేరోజు. అటువంటిది నువ్వు యిలా వున్నావూ అంటే - నీ మొహం తిరిగి చూస్తాడా, నీకాపురం ఏమవుతుందో యింత పిసరయినా ఆలోచించావా ? నీ భర్తని సంతోష పెట్టడం కన్న వేరే ఏముంది చెప్పు !''

''................''

''నిన్ను పెంచి పెద్ద దాన్ని చేసాం... ఏ లోపం యింత వరకూ రానివ్వలేదు... పువ్వులా ఎంతో ముద్దుగా పెరిగావు... యీడు రాగానే తగిన వాణ్ణి తెచ్చి - నిన్నో యింటిదాన్ని చేశాం!... నీ సంసారం నువ్వు దిద్దుకొని పుత్ర పౌత్రాభివృద్ధితో - సుఖంగా వుండాలనే కదా మా కోరిక, పుట్టింటి పేరు నిలబెడతావని నమ్మేం. నీ సుఖం కోసం యిన్ని బాధలూ పడ్డాం... యింతకన్నా ఆడపిల్ల తల్లిదండ్రులు యింకేం చేయగలరు?... అంతవరకే పెద్దవాళ్ల బాధ్యత. ఆ తర్వాత భర్త దగ్గర మసులుకోవడం, అతని అభిమానాన్ని, ప్రేమని పొందడం, జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా చేసుకోడం, నీ చేతిలో వుంది.

ఆ హక్కు, యోగ్యత, బాధ్యత, స్వతంత్రం నీకు వచ్చింది. అందుకు తగ్గ తెలివితేటలూ, శక్తీ నీకు భగవంతుడిచ్చేడు. నువ్వాచరించవలసిన విధి. మొయ్యవలసిన భారం యింతవుండగా.. యిన్ని బాధ్యతలూ నీ మీద వుండగా యిలాటి పనిచేస్తావా?... యింకా చిన్నపిల్లవా ? ఒకరిచేత చెప్పించుకుందికి?'' అని కుమారి శతకం అంతా వల్లించింది.

కాని. ఏమీ అసలు బుర్రకే ఎక్కలేదు మాలతికి -

''అసలెలా ఆ ముక్క అనగలిగావు... నీకు సిగ్గూ లజ్జా లేదూ ? అంత యిష్టం లేకపోడానికి ఏమొచ్చింది ? నీలో ఆ వూహే పుట్టలేదా ? నీకా విషయమే అర్థం కాలేదా?.... నవ్వలా ఏడమొహం పెడ మొహం పెట్టుకు కూర్చుంటే ఆయనేమనుకుంటాడు ? అసలు నీకెలా నిద్ర పట్టింది !'' అని ఆమె తల్లి కొంచెం విపులంగా ... అర్థమయేలా, చిన్న చీవాట్లతో సహా అనడం మొదలెట్టింది.

''................''

''పోనీ నాతో చెప్పడానికి నీకేమిటి సిగ్గు! ... చెప్పు...న్వెందుకలా చేసేవు. వంట్లో బాగులేదా? భయమా ?... ఏమిటో చెప్పాలిగాని. అలా నీలో నువ్వు ఏదో అనుకుంటూ కూర్చుంటే ఎలా చెప్పు?''

''...............''

''చెప్పమ్మా! నా తల్లివికదూ! నా దగ్గర దాచవలసిన పనేమిటి ?'' అని కూతురు గడ్డం పట్టుకు బ్రతిమాలింది తల్లి. మాలతి ఆశ్చర్యంతో తల్లివైపు చూసింది.

''ఏం లేందే ఏమిటమ్మా... చెప్పేది?....'' అని అమాయకంగా అంది.

''ఏం లేదూ ? .. వాలకం బాగానే వుంది అయితే ఎందుకిదంతా జరిగింది ?''

''ఏం జరిగింది యిప్పుడు?''

'' అయ్యో! సింగినాదమా ? ఇంకా నీకు బోధపడలేదా ! ... పోనీ... నీ మొగుడు ఎందుకు వెళ్లిపోయాడు. యివాళ యింకా వుంది కదా ?''

''అదేమో నాకేం తెలుసు ? నాతో ఏం చెప్పారా ! చేశారా ?''

''సరి! యింతకీ నిన్నననవలసిన పనేముంది ? మా గ్రహచారం యిలా వుండగా.. నీకసలేమీ తలకెక్కలేదు కదా ! యింకేం చేసేది ! '' అని కంట నీరు పెట్టుకుంది.

'' ఎందుకమ్మా ! అలా ఇదయిపోతావు ? నువ్వన్నదేమిటో నాకేం బోధపడందే ఏం చెప్పను. అతను వెళ్లిపోయినంత మాత్రంలో ఎందుకింతలా యిదయిపోతున్నారు? ఏం పనుండి వెళ్లిపోయారో ఏమో!'' అని మాలతి అంది.

''పనుంటే చెప్పి వెళ్లరటే.. నీకు తెలుసు.. నిజం చెప్పమ్మా ! ఎందుకిలా బాధపెడతావు?''

''నిజంగా నాకేం తెలీదమ్మా!''

''పోనీ యీ రెండు రోజులూ నీతో బాగానే వున్నాడా ?''

''పో అమ్మా!.. నువ్వు మరీని..'' అని గునిసింది... మొహం కందగడ్డలా చేసుకొని-

''అందుకే వచ్చింది ... అదుగో... చూసినవాళ్లు చెప్పలేదూ ?... నీనుంచే అతను వెళ్లిపోయాడు- యిలాగే మొండితనం చేసి వుంటావు!''

''....నా నుంచా!...'' అని ఆశ్చర్యంగా మాలతి అడిగింది.

''అవును - నీ నుంచే - నువ్వు. ఆయన్ని దగ్గరకి రానివ్వలేదటగా ... ఏం తల్లీ! నాతో నిజం చెప్పు. నీ కొచ్చిన కష్టం ఏమిటి!''కట్టుకున్న భర్తతో అలా చెయ్యొచ్చా.. అందుకే కోపం వచ్చి వెళ్లిపోయాడు..''

ఈ మాటలు విని మాలతి పకపకా నవ్వింది.

''నవ్వులాటేమిటే - వెర్రి పిల్లా!''

'' - లేకపోతే ఏమిటమ్మా! నువ్వనేది! ... నీకిదంతా ఎవరు చెప్పేరు ?''

''ఎవరు చెప్పేది ఏమిటి ? తెలీదూ నీ వాలకం చూస్తే !''

''నిజంగా నామొహం చూసే అంటున్నావా అమ్మా యీ మాటలు ? లేక ఎవరో చెబితే

అంటున్నావా?''

''ఎవరయినా ఏమీ లేకపోతే ఎందుకు చెబుతారు?''

''ఎవరికయినా ఏం తెలుస్తుందమ్మా! లోపల ఏం జరిగిందో? వుత్తి అబద్ధాలుగాని...''

''చూసిన వాళ్లే చెబుతున్నారమ్మా!''

''ఏం చూశామని చెప్పేరమ్మా?''

''...ఈ రెండు రాత్రులూ అతన్ని దగ్గరికి నువ్వు రానివ్వలేదని - అతను వచ్చినా నువ్వు మాటాడలేదని-''

''ఎవరమ్మా ఆ చూసినవాళ్లు!''

''ఎవరోలే.. ఎవరయితేనేం! నీ మంచి కోరే కదా చెప్పేది!''

''అలా చూడవచ్చా అమ్మా! పెద్దవాళ్లయివుండి!''

''సరి నీతులకేంలే! అదో ఆచారం! యివాళా? విన్నావా? అనాది నుండీ వస్తూంది. దానికేం గాని.. వాళ్లు చెప్పింది నిజమేనా?''

''అయితే వాళ్లూ తెల్లవార్లూ చూస్తూనే వున్నారా అమ్మా?''

''బావున్నాయి నీ మాటలు. ఒకటి అడుగుతే మరొకటి చెబుతున్నావు - ఎంత వరకూ చూశారో ఏమిటో నేనడగలేదు!'' అని జడ వేయడం పూర్తి చేసి - జడ గంటలు బిగించి తలలో పువ్వులు ముడిచింది.

''కనుక్కో అమ్మా!..'' అని పకపక నవ్వుతూ... జడ గంటలు ముందుకు లాక్కొని విసురుగా.. లేచి... సిగ్గుతో అక్కడి నుండి పారిపోయింది మాలతి.

ఆ జవాబులో అర్థం పూర్తిగా గ్రహించలేకపోయింది మాలతి తల్లి. కాని. కూతురు కులాసా చూసి నవ్వుకుంది.

''అదేమిటే అలా వెళ్లిపోతావు. అడిగిన సంగతి చెప్పకుండాను... వెర్రి పిల్ల! ఏం తెలీదు కదా! ఎలా కాపురం చేస్తుందో ఏమో!'' అని తనలో అనుకుంది మాలతి తల్లి. తతిమ్మా వాళ్లెవరూ గ్రహించలేక పోయినా కూతురిలో మార్పు, ఆమె ప్రవర్తన, చూసి కొంచం నిబ్బర పడింది. అమ్మలక్కలన్న వాటిలో ఏ మాత్రం నిజం వుందో గ్రహించింది. అయినా పూర్తిగా అనుమానం పోలేదు...

అందుకనే భర్తతో కూడా ఆ విషయం చెప్పింది. అతను కూడా మొదట్లో గాభరా పడకపోలేదు. తమ వల్లే తప్పుందా లేక అందరూ అంటున్నట్టు కూతురే ఏం తెలివి తక్కువగా ప్రవర్తించిందో, ఏమిటి కారణమో అని భయపడుతూనే వున్నాడు. అంతలోనే భార్య కూడా అలాగే అనుమానపడి చెప్పవలసినదంతా చెప్పి -

''వెళ్లండి.. వాళ్లింటికి వెళ్లి కారణం ఏమిటో కనుక్కోండి. పిల్లవల్ల ఏదయినా తప్పుంటే - చిన్నది, అమాయకురాలని చెప్పి బతిమాలి తీసుకురండి ఏంచేస్తాం!'' అని అంది.

''నేనూ అదే అనుకుంటున్నా. యివాళే బయలుదేరి వెళ్లి బతిమాలుకొని తీసుకుని వస్తాను!''

ఇలాగని అతను అల్లుని దగ్గరకి వెళ్లి తీసుకురాడానికి ప్రయాణమయినాడు. అతనూ యిలా గుమ్మం దిగుతూండే సరికి పోస్టువాడు ఎదురయేడు.

పోస్టువాడు ఇచ్చిన ఎక్స్‌ప్రెస్ వుత్తరం అందుకుని అది అల్లుడి దగ్గరనుండే వచ్చిందని చూడగానే గ్రహించాడు. మాలతి తండ్రి, గుండె దడదడ లాడుతూండగా ఆతృతతో విప్పి చదివాడు.

తొడిగిన చెప్పులు వదిలేసి లోపలకు వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. ఉత్తరం భార్యకు అందిస్తూ... '' ఎంత పని చేశాడు. '' అని నవ్వుతూ అన్నాడు.

ద్వారం వరకూ వచ్చిన అతని భార్యకేమీ అర్థం కాలేదు. ''ఏమండీ ఏమయింది! మళ్లీ కూర్చుండి పోయారేమిటి ?'' అని తొందరగా అడిగింది.

''అల్లుడి దగ్గర నుండే వుత్తరం వచ్చింది !...'' అని నవ్వుతూనే అన్నాడతను.

''అల్లుడి దగ్గరనుండా. ఏం రాశాడేమిటి? ఎందుకలా వెళ్లిపోయినట్టు!'' అని ఆతృతతో అడిగింది.

''...మరేం లేదు. నిన్న అతని పేర టెలిగ్రాం వచ్చిందట... ఈ రోజున ఇంటర్వ్యూకి రమ్మని ఆర్డర్లు వచ్చేయని. అంచేత వెంటనే బయలుదేరి రమ్మని వాళ్ల నాన్నగారు ఆ టెలిగ్రాం యిచ్చారట. ఆ సంగతి మనతో చెప్పి వెళ్లడానికి టైములేక అలాగే వెంటనే బండిలో వెళ్లిపోయాడట.. చెప్పకుండా వెళ్లి పోతున్నందుకు గాభరా పడవద్దని, ఏమీ అనుకోవద్దని, ఉత్తరం వ్రాసేడు. ... అది అసలు విషయం!''

''అబ్బ! ఎంతపని చేశాడు. ఇంటిల్లిపాదీ బెంగపెట్టుకు చచ్చాం!''

'' వాళ్ల మాటలూ, వీళ్ల మాటలూ విని నన్ను భయపెట్టి చంపావు! చూశావా.. ఏమీ ఎరగని మాలతిని నానా మాటలూ అన్నావు!''

''వీళ్లనోళ్లు పడిపోనూ, ఎన్నెన్ని చిలువలూ, పలువలూ, కలిపించి చెప్పేరండీ!... నిజంగా యింకా నాకు భయం పోనేలేదు. అయినా మాలతిని అడిగినపుడు నా అనుమానం పోయిందనుకోండి. అయినా చిన్నపిల్ల, కణాయించి అడిగితే, ఏం చెబుతుంది. పాపం!... ఇంతకీ నేనేం చేసేది ? ఎటుంచి ఏమొస్తుందో అన్న భయం కొద్దీ మీతో చెప్పేను.

'' నువ్వు మాత్రం ఏం చేస్తావులే పాపం!.... అతడలా అకస్మాత్తుగా వెళ్లిపోయేటప్పటికి నాకూ భయం వెయ్యక పోలేదు.. ఏం జరిగింది చెప్మా! అని, కాకీ వాలింది... పండు పండింది అన్నట్టు - మనపిల్ల అదృష్టవంతురాలే! కార్యం కాగానే ఉద్యోగం కూడా దొరికింది. యింక వాళ్ల కాపురం వాళ్లు చేసుకుంటారు.''

''అమ్మా... మాలతీ నా .. తల్లీ ..'' అని ఆనందం పట్టలేక పిలవబోయేసరికి అంతవరకూ తలుపు చాటు నుండి అంతా వింటూ చూస్తున్న మాలతి తుర్రుమని లోపలికి కిలకిల లాడుతూ పారిపోయింది.

★ ★ ★

*(ఆంధ్రప్రదేశ్ 9-1962.)*